క్లుప్తంగా

నేటి నుంచి తిరునాల



ముస్తాబైన వీరాంజనేయస్వామి ఆలయం

కలసపాడు : మండలంలోని మహానందిపల్లె గ్రామంలో ఆది, సోమవారాల్లో వీరాంజనేయ స్వామి తిరునాల నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, 10 గంటలకు సీతారాముల కల్యాణం, రాత్రి గ్రామోత్సవం ఉంటుందన్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు అందజేస్తారన్నారు. రెండు రోజులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మృత్యుంజయ హోమం



హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పార్టీ పురోభివృద్ధికి కృషి



మాజీ ఎమ్మెల్యే రాచమల్లుకు కృతజ్ఞతలు తెలుపుతున్న వెంకటరమణారెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ పురోభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆ పార్టీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ అసోసియేషన్ విభాగం ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు లక్కిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ అసోసియేషన్ విభాగం ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా లక్కిరెడ్డి వెంకటరమణారెడ్డిని నియమించారు. ఆయన శనివారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి ఉన్నారు.

సన్మానం



సిద్దార్థరెడ్డికి మిఠాయి తినిపిస్తున్న రెడ్యం

చాపాడు: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన బైరెడ్డి సిద్దార్థ రెడ్డిని శనివారం ఆ పార్టీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కలిశారు. కడపలోని బైరెడ్డి గృహంలో కలసిన రెడ్యం శాలువ, పూలమాలతో అభినందించారు. ఈయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్యం సుబ్బారెడ్డి, బత్తల సుబ్బరాయుడు యాదవ్ పాల్గొన్నారు.

ఎంపీకి ఆహ్వానం



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందిస్తున్న అమర్నాథ్‌రెడ్డి

మైదుకూరు: మైదుకూరు మున్సిపాలిటి పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామ శివారులో వెలసిన గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి పునఃప్రతిష్ఠ మహోత్సవ వేడుకలకు హాజరుకావాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ గ్రామంలో శ్రీపోలేరమ్మ తల్లి పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకలకు హాజరుకావాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆహ్వానించామని తెలిపారు.

నివాళి

పోరుమామిళ్ల: పుల్లివీడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొడుగు ఖాజావలి (42) గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పుల్లివీడు వెళ్లి ఖాజావలి మృతదేహానికి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఖాజావలికి భార్యా ఇద్దరు పిల్లలు ఉన్నారని నాగార్జునరెడ్డి చెప్పారు. పార్టీ ఓ కార్యకర్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సీతారాముల పెళ్లికి రారండి

- నేడు రఘురాముడి కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి
- శ్రీరామనవమికి ముస్తాబైన ఆలయాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీరామనవమిని పురస్కరించుకుని పట్టణంలోని పలు రామాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాలకు రంగులు వేయడంతోపాటు విద్యుత్ దీపాలు, చలువ పందిళ్లు, సెట్టింగ్‌లతో ముస్తాబు చేశారు. స్థానిక కోనేటి కాలువ వీధిలోని పట్టాభిరామ ఆలయంలో శ్రీరామ నవమి వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంటల వరకు అభిజిత లగ్నంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయం వద్ద భారీ చలువ పందిళ్లు వేయడంతోపాటు కల్యాణ వేదిక ఏర్పాటు చేశారు.

- అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని అభయ వరద సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం దేవతా మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ చేశారు. విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవచనం, పంచగవ్యం, దీక్షాధారణ అంకురార్పణ, మంటపార్చన, అగ్ని ప్రతిష్టాపన, దీక్షా హోమాలు చేశారు. ఆదివారం ఉదయం సీతారాముల కల్యాణోత్సవం వైభంగా నిర్వహిస్తున్నామని, కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు కోరారు. సోమవారం ఉదయం 7 గంటలకు సీతారామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.
- అమ్మవారిశాల వీధిలోని శ్రీ ఆత్మారామస్వామి ఆలయంలో శ్రీఆత్మారామస్వామి భక్త సమాజ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం గణపతి, నవగ్రహ, సీతారామాంజనేయ, సుదర్శన, శ్రీచక్ర, కుబేర హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. శ్రీరాముడిని కృష్ణావతారంలో అలంకరించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆరు బయట అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 4 గంటలకు సీతారాముల స్వామి గ్రామోత్సవాన్ని పురవీధుల్లో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలో వేషధారణలు, కోలాటం, బాణసంచా పేలుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని దేవాంగపేట, పార్కు వీధి, వసంతపేట తదితర ప్రాంతాల్లోని అన్ని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



కృష్ణావతారంలో శ్రీరాముడు

శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం

గోపవరం : శ్రీరామనవమి వేడుకలకు మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉన్న కోదండరామ స్వామి ఆలయాలు సర్వం సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం నుండే ఆలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. శనివారం రాత్రి నుండే అన్ని రామాలయాలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. ఈ వేడుకలను వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. సీతారాముల కల్యాణం అనంతరం స్వామివారి గ్రామోత్సవాలతో పాటు వసంతోత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.



అభయ వరద రామచంద్ర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమంలో కలశాలు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం ఎన్‌జీవో కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అకాల వర్షంతో వందలాది ఎకరాల్లో అరటి తోటలు నేలమట్టమవడంతో పాటు పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వరి, సజ్జ పంటలు చేతికొచ్చే సమయంలో వడగళ్ళు, ఈదురు గాలులకు అవి కూడా నేలమట్టమయ్యాయని అన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికొస్తున్న సమయంలో ప్రకృతి వైపరిత్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, తక్షణమే జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించి పంట నష్టం అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వం ద్వారా నష్టపోయిన ప్రతి రైతుకు ఇన్‌స్రూ ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించడంతో పాటు ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్న ఎంఈఓను సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వీరశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించే ఘటనలు వరుసగా జరగడానికి ఆయా పాఠశాలల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరే ప్రధాన కారణమని అన్నారు.జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి సంబంధిత పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, మహిళా సంఘం నాయకురాళ్లు విజయమ్మ, నవనీతమ్మ, విజయ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



ఉద్యానవన అధికారి జయభరత్‌రెడ్డి

అట్లూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యాన పంటల్లో సాంకేతిక, సస్యరక్షణ చర్యలు చేపడితే రైతులు లాభాలను పొందవచ్చని ఉద్యానవన అధికారి జయభరత్‌రెడ్డి పేర్కొన్నారు.

మామిడి సాగులో సూచనలు

ఈ ఏడాది మామిడిలో పూత ఆలస్యంగా రావడం వలన పిందె అనుకున్న స్థాయిలో నిలబడలేదు. పిందెను కాపాడుకోవడానికి ప్లానోఫిక్స్ 2 మిల్లీ లీటర్లు, 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. అలాగే తేనెమంచు పురుగు తక్కువగా ఉన్నప్పటికీ బాక్టీరియా బంకతెగులు నివారణకు బ్లీతోస్ 3 గ్రాములు, ప్లాంటోమైషిన్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పొడి వాతావరణంలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు ఎస్ఫేట్ 1.5 గ్రాములు లేదా పిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లు లేదా ఇమిడా క్లోప్రైడ్ 0.3 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళ పిచికారి చేయాలి.

చీనీ, నిమ్మలో..

ప్రస్తుత సీజన్‌లో చీనీ, నిమ్మలో కాయ బఠానీ సైజు ఉన్నప్పుడు తామర పురుగు లేదా నల్లి ఆశించినప్పుడు పిప్రోనిల్ 2.మిల్లీ లీటర్లు, డైకోఫాల్ ఒక మిల్లీ లీటరు.. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అలాగే కాయ నాణ్యత పెరగడానికి 13-00-45 .10 గ్రాములతో పాటు ఫార్ములా-4. 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పుచ్చ, దోస సస్యరక్షణ చర్యలు

పుచ్చ, దోస పిందె కాయ ఎదుగుదల దశలో డ్రిప్ ద్వారా పోటాస్, సూక్ష్మపోషకాలైన బోరాన్, కాల్షియం నైట్రేట్ వాడడం వలన కాయ పగుల్లు లేకుండా మంచి సైజు రావడంతో పాటు నాణ్యత పెరిగి ధర లభించే అవకాశం ఉంటుంది.

దానిమ్మలో..

మార్చి నెల నుంచి మే నెలలో చెదురు మొదురు వర్షాల వలన బాక్టీరియా ఆకుమచ్చతెగులు ఆశించి నాణ్యత గణనీయంగా దెబ్బతింటుంది. దీని నివారణకు కొసైడ్ 3 గ్రాములు లీటరు నీటికి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. ఇలా చేయడం వలన కాయలు నాణ్యత పెరగడంతో పాటు దిగుబడి పెరుగుతుంది.

అరటి సాగులో..

ప్రస్తుతం అరటి గెలలు వేసి కొత్త దశకు చేరుకుంటున్నందున డ్రిప్ ద్వారా పొటాషియంతో పాటు కాల్షియం నైట్రేట్ ఎరువులు, సూక్ష్మపోషకాలు అందించాలి. గాలుల నుంచి చెట్లను కాపాడు కోవడానికి గెలకు సపోర్టుగా (పోట్లు) పెట్టాలి. వేసవిలో సూర్యరశ్మి నేరుగా గెలలపై పడితే మాడిపోతాయి. కాబట్టి ఆకులను గెలలపై కప్పి నాణ్యతను పెంచుకోవాలి.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని ఆందోళన

బద్వేలు అర్బన్ : ఎన్‌హెచ్-67 రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గుంతపల్లె గ్రామ సమీపంలో నిర్మించిన ఫ్లైఓవర్ కింది భాగంలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని శనివారం గుంతపల్లె గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డి.ప్రసాద్, రామచంద్రయ్యలు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గ్రామ సమీపంలో ఫ్లైఓవర్ నిర్మాణం మొదలు పెట్టిన సమయంలో రైతులతో కలిసి ఆందోళన నిర్వహిస్తే ఫ్లైఓవర్ పూర్తి కాగానే సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పిన నేషనల్ హైవే అధికారులు, కాంట్రాక్టర్లు ఫ్లైఓవర్ పూర్తయ్యే సమయానికి సర్వీసు రోడ్డు విషయం మా చేతుల్లో లేదని చేతులెత్తేయడం దారుణమన్నారు. సర్వీసు రోడ్డు లేని కారణంగా వంద మీటర్ల దూరంలోని పొలాలకు సైతం 5 కిలోమీటర్లు తిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. అంతేకాకుండా ఎక్కడా కూడా సక్రమంగా కల్వర్టులు, సైడు కాలువలు నిర్మించలేదని, బద్వేలు పెద్ద చెరువుకు నీరు అధికంగా చేరి అలుగు పారితే పంటలు నీట మునిగే ప్రమాదముందని, తద్వారా దాదాపు 150 ఎకరాల్లో పంట నష్టం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయించేందుకు కృషి చేయాలని కోరారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నేడు స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై సదస్సు

మదనపల్లె : ప్రొద్దుటూరు కొర్రపాడురోడ్డులోని ఆదిత్యారామ్ షాపింగ్‌మాల్, రెండో ఫ్లోర్‌లోని శ్రీ చక్ర బాంకెట్ హాల్‌లో ఆదివారం స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫైనాన్సియల్ అడ్వైజర్ కృష్ణకైలాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

గ్రూప్-2 మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న కొలిమి మహబూబ్ బాషా ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలో ప్రతిభ కనబరిచి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)కు ఎంపికయ్యాడు. అధ్యాపకుల బోధన, విద్యార్థి కృషి వల్లనే సీబీటీ టెస్టుకు ఎంపికైనట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కె.సునీల్ బాబు, కె.సృజన్ తెలిపారు. మహబూబ్‌బాషాను డైరక్టర్లతోపాటు అధ్యాపకులు అభినందించారు.

కలలు కనండి... సాకారం చేసుకోండి

చాపాడు: దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు.. ప్రతీ విద్యార్థి కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేలా పట్టుదలతో చదవాలని ట్రైనీ డీఎస్పీ భవాని పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో శనివారం రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలు, కాలేజీ స్థాయిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు సూచనల మేరకూ తల్లిదండ్రుల ఆశయాలతో చదువుకోవాలన్నారు. విద్యార్థులు చదువు అనంతరం మంచి కలలు కని వాటిని సివిల్ సర్వీసెస్ ద్వారా సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చననారు. ఒక ప్రణాళికబద్ధంగా చదువుకుంటే అనుకున్న లక్ష్యం చేరుకుంటారని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఇంజినీరింగ్ విద్యార్థులు చదువు అనంతరం సాఫ్ట్‌వేర్ వైపు మాత్రమే కాకుండా సివిల్ సర్వీసెస్‌పై కూడా విద్యార్థులు దృష్టి పెట్టాలని దాని ద్వారా సమాజానికి మంచి సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. భారతి ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. సివిల్ సర్వీసెస్ ద్వారా సాధించే ఉద్యోగాల వలన ఎటువంటి సమస్యనైనా పరిష్కారం చేయవచ్చన్నారు. రిఫ్లెక్షన్ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్లు మధుసూధన్‌రెడ్డి, వివేకానంద, సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శృతి పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల , కాశినాయన, కలసపాడు, బి. కోడూరు మండలాల్లో జీపీఐ పొగాకు కంపెనీ ఏజెంట్లు రైతులకు మోసం చేశారని సీపీఐ నాయకులు మస్తాన్, రవి, కేశవులు చెప్పారు. శనివారం వారు మాట్లాడుతూ గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పొగాకు తడిసి ముద్దయ్యిందన్నారు. పొగాకు గురించిన సమాచారం ఇచ్చి, తమకు న్యాయం చేయాలని అడిగేందుకు కంపెనీ సిబ్బందికి, ఏజెంట్లకు ఫోన్ చేస్తే పలకడం లేదన్నారు. విత్తనం ఇచ్చిన కంపెనీ వారు పరారయ్యారని, రైతులకు అన్యాయం చేశారన్నారు. ఒక్కో రైతు ఎకరానికి రూ. 25 నుండి 30 వేలు ఖర్చు చేశాడని, పొగాకు ఆరబెట్టారని, తీరా కంపెనీవారు తీసుకొని డబ్బు ఇస్తారనుకుంటున్న సమయంలో హఠాత్తుగా వచ్చిన వర్షం వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ

చాపాడు: హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అని ట్రైనీ డీఎస్పీ భవాని పేర్కొన్నారు. మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని చాపాడు పోలీసు స్టేషన్ వద్ద వాహనదారులకు శనివారం సాయంత్రం హెల్మెట్ వాడకం, సీట్లు ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులకు తప్పనిసరిగా జాగ్రత్తలుగా పాటించాలని, ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరిగినా బైక్ నడిపే వారికి హెల్మెట్ రక్షణగా ఉంటుందని తెలిపారు. ఇతర వాహనాలు నడిపేవారికి సీట్ బెల్టు ఉపయోగపడుతూ ప్రాణపాయ స్థితి నుంచి రక్షించుకుంటారన్నారు. రోడ్డు భద్రత నిబంధనల మేరకూ వాహనదారులు లైసెన్స్, ఇతర అనుమతి పత్రాలు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ భవాని

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

బద్వేలు అర్బన్ : ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని సుమో స్టాండ్ వద్ద కార్లు, ట్రాక్టర్, జేసీబీ డ్రైవర్లకు రోడ్డు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లోపం, మితిమీరిన వేగంతో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిపై ప్రతి డ్రైవర్ దృష్టి సారించాలని కోరారు. కార్లు డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని కోరారు. ఎస్ఐలు ఎం.సత్యనారాయణ, జె.రవికుమార్, సిబ్బంది, సుమో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే తెలపండి

రాజుపాళెం : గ్రామంలో సమస్యలు ఉంటే తమకు తెలపాలని ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాలమద్దిలేటి పేర్కొన్నారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలో ఫ్యాక్షన్ , సైబర్ క్రైం, భూ సమస్యలపై గ్రామస్తులకు శనివారం సాయంత్రం ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజుపాళెం ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ సమస్యలు ఉంటే గొడవలు చేసుకోకుండా తమకు తెలిపితే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

పోరుమామిళ్ల: రహదారి ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సీఐ శ్రీనివాసులు శనివారం సాయంత్రం అంబేడ్కర్ సర్కిల్‌లో వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, రోడ్డు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

ప్రొద్దుటూరు క్రైం : వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాషా తెలిపారు. తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లు సవరణ ద్వారా ముస్లిం సమాజాన్ని అణగదొక్కాలని చూస్తోందన్నారు. ఈ బిల్లును సమర్థించి తెలుగుదేశం, జనసేన పార్టీలు ముస్లింలకు ద్రోహం చేశాయని చెప్పారు. టీడీపీ చేసిన మోసాన్ని ముస్లిం ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు.

పేదల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్



ప్రొద్దుటూరు : బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



బద్వేలు అర్బన్ : జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోరుమామిళ్ల: బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ పేదల ఆశాజ్యోతి అని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ కొనియాడారు. పట్టణంలోని పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం జగ్జీవన్ రామ్ 118వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏపీఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సుధాకర్ మాదిగ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దళితుల సంక్షేమానికి, అభివృద్ధికి ఆయన కృషి చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు సాకే నారాయణస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కేశపల్లి నాగేంద్ర, పసుపులేటి శివకృష్ణ, ప్రసాద్, రాజేశ్వరి పాల్గొన్నారు.

- విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ యల్లయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ (బ్రహ్మయ్య మాదిగ వర్గం) జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహులు మాదిగ, కత్తి ఓబులేసు, జగన్, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, బయన్న, లింగమయ్య, దాసు, నరసింహ, శ్రీను పాల్గొన్నారు.
- స్థానిక మహాజన రాష్ట్ర సమితి కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. మహాజన రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు యావరం చంద్రశేఖర్, ఎర్రన్న, యల్లయ్య, సుబ్బరాయుడు, నాగసుబ్బరాయుడు, చంద్ర, రవి ప్రసాద్, రామాంజనేయులు, సుధాకర్, ఇనాయతుల్లా, నగేష్, బింగి సుబ్బరాయుడు తదతరులు పాల్గొన్నారు.

చాపాడులో..

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం బాబా జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కర్ణమాదిగ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు భాస్కర్ శ్యామ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త జగ్జీవన్‌రామ్

బద్వేలు అర్బన్ : సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అని మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జి.సుందర్‌రామిరెడ్డిలు పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక సిద్దవటం రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బూత్‌కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, అట్లూరు మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్ హసాన్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు బిజ్జరమణ, మౌలాలి, షఫి, లక్ష్మిరెడ్డి, షరీఫ్, ఎస్సీ సెల్ నాయకులు నారాయణ, ప్రతాప్, మురళి, కేశవయ్య, రుద్రశివ, చరణ్, హరి పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో..

భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం ఎంఈఎఫ్ నాయకులు యర్రబల్లి ఓబయ్య ఆధ్వర్యంలో స్థానిక సిద్దవటం రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు కమలాపురంప్రసాద్, దేవానందం, ఓసూరిభాస్కర్, జయచంద్ర, పిచ్చయ్య, కేశవయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే దళిత హక్కుల పోరాట సమితి, రజకవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలో బాబు జగ్జీవన్ రామ్188 వ జయంతిని శనివారం వివిధ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. రంగసముద్రం పంచాయతీ సచివాలయంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచ్ నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ ఇస్సాక్, తిరుమలశెట్టి సుబ్బారావు, గిరిప్రణీత్‌రెడ్డి, కార్యదర్శి రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యాలయంలో..

ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఉపాధ్యాయ నాయకులు రమణారెడ్డి, సత్తార్, క్రిష్టారెడ్డి, సుబ్బయ్య, రామభూపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాగసుబ్బారెడ్డి జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు.

ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో..

సమాజం కోసం, ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సుబ్రహ్మణ్యం, క్రిష్టారెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్య, వెంకటరెడ్డి, జనార్ధన్‌శెట్టి, నారాయణరెడ్డి, అబ్దుల్‌ఉసేన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌లో..

జగజ్జీవన్‌రామ్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన జగ్జీవన్ రామ్ జయంతి సభలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, మాదిగ ఉద్యోగ సంఘ నాయకులు జయరాం, బాలజోజి, యంబడి ఈశ్వర్, శోభన్‌కుమార్, ప్రసాద్, అన్వర్‌బాష, ఇన్నయ్య పాల్గొని మాట్లాడారు.

మదర్‌థెరిస్సా సేవా పురస్కారం ప్రదానం

కాశినాయన : మండలంలోని మిద్దెల గ్రామానికి చెందిన ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా టీచర్, సంఘసేవకుడు బి.ఎస్.నారాయణరెడ్డికి ప్రకాశం జిల్లా మార్కాపురంలోని వెల్ఫేర్ సొసైటీ సేవా సంస్థ వారు మదర్‌థెరిస్సా జాతీయ సేవా పురస్కారం అందించారు. ఈ సందర్భంగా బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకేశవులు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తూ నిరంతరం ప్రజాసేవకు అంకితమైన బి.ఎస్.నారాయణరెడ్డి సేవలు మరువలేనివన్నారు. గిద్దలూరు పట్టణంలో కాశినాయన ఆశ్రమంలో వారానికి ఒకసారి అనాథలకు భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు పలు రకాల సేవా కార్యక్రమాలు చేస్తుంటారని కొనియాడారు. సొసైటీ నిర్వాహకులకు బి.ఎస్.నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.